సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,24 జూలై 2024


# కానరాని శుద్ధగడ్డ ఆధునీకరణ



**- వరద ముప్పునకు గురవుతున్న పంట పొలాలు - లబోదిబోమంటున్న అన్నదాతలు**

**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు పట్టణ శివారు శుద్ధ గడ్డ ఆధునీకరణ గొల్లప్రోలు ప్రజలకు, రైతులకు నిరాశ మిగిల్చింది. దశాబ్దాల నుండి రాజకీయ పార్టీలు శుద్ధ గడ్డ ఆధునీకరణ పనులపై రైతులకు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి విడిచిపెట్టి అరచేతిలో స్వర్గం చూపెట్టారే తప్ప రైతు సమస్యలపైన, ప్రజా సమస్యలపైన పట్టించుకున్న నాయకులు అధికారులు కరువయ్యారు. గొల్లప్రోలు పట్టణ శివారు కొండ కాలువ శుద్ధ గడ్డ కాలువలు ఆక్రమణలకు గురి కావడంతో వరద నీరు దిగువ ప్రాంతానికి వెళ్లకుండా గొల్లప్రోలు పట్టణం దేవి నగరం, శివాలయం కాలనీ, ఈబీసీ కాలనీ పంట పొలాలు వరద ముప్పునకు గురవుతున్నాయని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రాష్ట్ర డిప్యూటీ సీఎం, పిఠాపురం శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ సమస్యల పరిష్కారాలపై దృష్టి నిలిపి ఏలేరు శుద్ధ గడ్డ కొండ కాలువ ఆధునీకరణ పనులు చేపట్టాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే గొల్లప్రోలు సీతానగరం లక్ష్మీపురం ఆయకట్టు పంట భూములలో పండిన వరి, వాణిజ్య పంటలు సకాలంలో ఇంటికి చేరేలా ఆ దారుల అభివృద్ధి, వంటకాలువలు పూడికతీతలు లాంటి రైతు సమస్యలు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని నగరవాసులు, రైతులు కోరుతున్నారు.

# నాలుగు స్తంభాలాట

**- క్యాడర్‌లో నిర్లిప్తత**
**- కీలకంగా బాబీ వర్గం**









**కాకినాడ రూరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని కాకినాడ రూరల్ నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీ నాలుగు స్తంభాలాట ఆడుతోంది. ఇక్కడ కూటమిలో భాగంగా జనసేన అభివృద్ధి నానాజీకి టికెట్ ఇచ్చారు. ఆయన భారీ మెజార్టీతో గెలిచారు. 72 వేల పైచిలుకు మెజారిటీతో నానాజీ రికార్డు సృష్టించారు. దీంతో ఇక్కడ తెలుగుదేశం పార్టీకి మింగుడుపడడం లేదు. వాస్తవానికి రూరల్ నుంచి టిక్కెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు నానాజీ పేరు ప్రకటించగానే సైలెంట్‌అయ్యారు. వారి అనుచరులు మాత్రం రెచ్చిపోయారు. చంద్రబాబు, లోకేష్, తెలుగుదేశం పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు పెట్రోల్ పోసి తగలబెట్టారు. అత్యంత దారుణంగా చంద్రబాబును దూషించారు. చంద్రబాబుఇదిసీరియస్‌గా తీసుకున్నారు. దీంతో పిల్లి సత్తిబాబు తన అనుచరులకు నచ్చజెప్పారు. పార్టీ కోసం పని చేయండి అంటూ చంద్రబాబు ఆదేశించారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారు పనిచేయాల్సి వచ్చింది. శెట్టిబలిజ సామాజిక కోటాలో రామచంద్రపురం నుంచివాసంశెట్టి సుభాష్ కు టికెట్ ఇచ్చారు.దీంతోబీసీలు శాంతించారు. సుభాష్ గిరిజన తర్వాత మంత్రివర్గంలో స్థానం కూడా కల్పించారు దీంతో బీసీలు ముఖ్యంగా శెట్టిబలిజ సామాజికవర్గం తెలుగుదేశం అధిష్టానంపై పూర్తి సంతృప్తిగా ఉంది. అదేవిధంగా కాకినాడ జిల్లాలో వైసిపి ఒక్క బీసీకి టికెట్ ఇవ్వకపోయినా కాకినాడ సిటీ, తుని నుంచి చంద్రబాబు ఇద్దరు బీసీలకు టికెట్ ఇవ్వడంతోబీసీలు పూర్తిగా కూటమికి పనిచేశారు. తాము ఒంటరి అవుతున్నామన్న భావన కలగడంతో పిల్లి దంపతులు పార్టీలో తిరిగారు. కానీ ప్రతి మీటింగ్‌లో వారు కౌంటర్ ఇస్తూనే వచ్చారు. మరోపక్క పార్టీ కీలక నేత, అర్ధబలం, అంగబలం పుష్కలంగా ఉన్న కటకంశెట్టి బాబిపార్టీకి కుడి భుజంగా మారారు.సర్వంతానేఅయి వ్యవహరించారు.దీంతో పిల్లి దంపతులు మైనస్ అయితే అది బాబీతో ప్లస్ అవుతుందని పార్టీ కూడా భావించింది. ఆయనను కో-కోఆర్డినేటర్‌గా నియమించింది. మరోపక్క ఎన్నికల ముందే పార్టీలో చేరిన మాజీ జెడ్పిటిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు కూడా పార్టీలో పిల్లి దంపతులలోటు తీర్చేందుకు బీసీ నాయకుడుగా అధిష్టానానికి కనిపించారు.

ఆయనకు ఎన్నికల కోఆర్డినేటర్ పదవి ఇచ్చేసారు.ఎప్పటినుంచో అదే సామాజివర్గానికి చెంది పార్టీని నమ్ముకుని ఎన్నో ఉచిత వైద్య సేవలు నిర్వహిస్తూ వైద్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు కూడా పార్టీకి నిబద్ధతతోపనిచేస్తూవచ్చారు. వీ.వై. దాస్, పెంకె శ్రీనివాస్‌బాబా వంటి వారు తిరిగినా ఆప్రభావంపెద్దగాకనపడలేదనితేలింది.దీంతో టీడీపీలో నాలుగుస్తంభాలాట మొదలైంది. ముఖ్యంగా పిల్లి సత్తిబాబు దంపతులను ఒంటరి చేసేందుకు బాబీ కీలకంగా వ్యవహరిస్తున్నారు. వారి అనుచరులుగా దశాబ్దం పైనుంచి పనిచేస్తున్న వారందరినీ బాబి తన వర్గంలోకి తీసుకున్నారు.అదేవిధంగాబీసీ సామాజిక వర్గాలకు చెందిన డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, నులుకుర్తి వెంకటేశ్వర రావు లను బాబి సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తున్నారు. దీంతో పిల్లి శిబిరం ఒంటరిగా మారింది అన్న ఆవేదన వారి అనుచరుల నుంచి వస్తోంది. ఈ నేపథ్యంలోనే పిల్లి దంపతులు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, పలువురు మంత్రులను కలిశారు. ఎన్నికల్లో తాము చేసిన ప్రచారం గురించి వివరించారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం బాబి వర్గానిది పైచేయిగా ఉంది. ఇద్దరు బీసీ నేతలు వెన్నంటి ఉన్నారు. అదే విధంగా రూరల్ కూటమి ఎమ్మెల్యే పంతంనానాజీ కూడా బాబీకి పెద్ద పీట వేస్తున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా కూడా బాబి ఉంటున్నారు.

దీంతో కాకినాడ రూరల్ తెలుగుతమ్ముళ్లకు బాబీ పెద్ద దిక్కుగా మారారు. బాబి వెంట ఉంటే గుర్తింపు వస్తుందన్న భావన కేడర్‌లో మొదలైంది. దీంతో పిల్లి వర్గం నుంచి ఒక్కొక్కరిగా బాబీ శిబిరంలో చేరుతున్నారు. ఎలాగూ బీసీ వర్గానికి ముఖ్యంగా పిల్లి సామాజికవర్గంలోని డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు ఇద్దరూ కూడా బాబీకి మద్దతు ఇచ్చారు. ఏది ఏమైనా ఈ నాలుగు స్తంభాలాటలో తనదే పైచేయిగా బాబీ ముందుకు వెళ్తున్నారు. ఇకనామినేటెడ్‌పదవుల పందారం ముందుంది.రూరల్ నియోజవర్గానికి ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశం ఎంత మాత్రం లేదు. పిఠాపురంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చిన టిడిపి ఇన్చార్జి వర్మకే ఎమ్మెల్సీ దక్కలేదు. దీంతో రూరల్‌కుఎమ్మెల్సీ ఇవ్వరని ఖరారు అయింది. ఈ నేపథ్యంలో గతంలో తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో గోదావరి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (గుడా) ఏర్పాటు చేశారు.

రాజమండ్రి సిటీలో గోరంట్ల బుచ్చయ్య చౌదరికి వ్యతిరేకంగా ఉన్న గన్ని కృష్ణకు ఆ చైర్మన్ గిరీ ఇచ్చారు. వైసిపి వచ్చాక గుడా రద్దు చేసింది. రుడా,కుడాఏర్పాటు చేసింది. ఇప్పుడు తిరిగి గుడా ఏర్పాటు అవుతుందని టిడిపి నేతలు చెబుతున్నారు. ఆ చైర్మన్ గిరీ కోసం బాబి కీలకంగా పావులు కదుపుతున్నారు. బీసీ టిడిపి నాయకుల మద్దతు ఉంది.అదేవిధంగా రూరల్ ఎమ్మెల్యే నానాజీ పూర్తిగా సహకరిస్తున్నారు. దీంతో గుడా చైర్మన్ పదవిపై బాబి కన్నేసారని ప్రచారం జరుగుతోంది.

ఖచ్చితంగా గుడా చైర్మన్ లేదా కీలకమైన రాష్ట్ర చైర్మన్ పదవి ఆయనకి ఇస్తారని పార్టీ వర్గాలు సైతం ప్రచారం చేస్తున్నాయి.దీంతో జనసేనకు ఇబ్బంది లేకుండా రూరల్‌లోవ్యవహారం చక్కదిద్దడంతో పాటు పిల్లిదంపతులకుచెక్‌పెట్టినట్లు అవుతుందని అధి ష్టానం అంచనా వేస్తోందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## రోటరీ స్మార్ట్ సిటీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రోటరీ స్మార్ట్ సిటీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికయింది. సోమవారం రాత్రి కాకినాడ రోటరీ క్లబ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎస్.వి.ఎస్. రావు, గౌరవ అతిథిగా రాజీవ్ గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకట్రావు, రోటరీ సహాయ గవర్నర్ సామా భాస్కర్ తదితరులు హాజరయ్యారు. 2024-25 సంవత్సరానికి అధ్యక్షుడిగా పోతుల రాంజీ, కార్యదర్శిగా నామాడి స్వామి శేఖర్, ఇంకా కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు సామంతల అజయ్ కుమార్, కే.సూర్యనారాయణ, జి.రోజా, టి.రవి తదితరులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సుమారు 160 సార్లు రక్తదానం చేసిన అనుసూరి మోహన్‌ను సత్కరించారు. ఇంకా ఈ స్మార్ట్ సిటీ క్లబ్ అనేక అవార్డులను సొంతం చేసుకుంది.

## ఆరోగ్యమే ఐశ్వర్యం

**- ఎంపిడిఒ రాజ్ మనోజ్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఆరోగ్యముంటే అదే ఐశ్వర్యమని కడియం మండల అభివృద్ధి అధికారి రాజ్ మనోజ్ అన్నారు. మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల వేమగిరి తోట-1 ను మంగళవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వ్యాధులు రావడానికి అవకాశమెక్కువని, అందరూ తమతోపాటు పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకుని, ఈగలు వాలని తాజా ఆహారాన్ని తినాలన్నారు. ఇంటా,బయటాకాచిచల్లార్చిన నీటిని త్రాగాలన్నారు. అప్పుడే ఆరోగ్యంగా ఉండగలుగు తామన్నారు. అకడమిక్ అకడమిక్ ఎక్టివిటీస్‌తోపాటు మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. సంతృప్తి చెందిన ఆయన చక్కగా పాఠశాలను నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు కే.జయరాజు ను అభినందించారు. శిక్ష సప్తాహ 2వ రోజు కార్యక్రమాలు చూసి ప్రశంసించారు. కార్యక్రమంలో మండల ఇంజనీర్ చోడిశెట్టి త్రిమూర్తులు, పంచాయత్ సెక్రటరీ రాజశేఖర్, ఉపాధ్యాయులు వై.నాగమణి సతీష్‌బాబు, బిల్ కలెక్టర్ శ్రీనివాస్, పావని తదితర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ఎటిగట్లు పటిష్ట పనులను పరిశీలించిన తహసీల్దార్ రవీంద్రనాథ్



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్:** రామచంద్రపురం నియోజకవర్గం గంగవరం మండలం కోటిపల్లి గ్రామంలో బలహీనంగా ఉన్న ఎటిగట్లు వద్ద ఇసుక బస్తాలతో పటిష్టపరుస్తున్న పనిని కె.గంగవరం తహసీల్దార్ పీరా రవీంద్రనాథ్, ఇరిగేషన్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాసరావు, డివిజనల్ ఇంజనీర్ కె.సుబ్బారావు, అసిస్టెంట్ ఇంజనీర్ రెహమాన్, వి.ఆర్.ఓ. డి.క్రిష్ణసాయి,సర్పంచ్ బేబీ సతీష్ మరియు రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారని అధికారులు తెలిపారు.

## రమ్య నర్సింగ్ కళాశాలలో సమస్యలు పరిష్కారం చేయాలి

**- అమ్మాయిలకు రక్షణ కల్పించాలి - ఎస్.ఎఫ్.ఐ. డిమాండ్**




**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా, కాకినాడ నగరం గాంధీనగర్‌లో ఉన్నటువంటి రమ్య కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ మొదటి, రెండవ సంవత్సరాలు చదువుతున్నారు. కళాశాలలో పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేరు. అధ్యాపకులు లేకపోవడం వలన విద్యార్థులు ఏ విధంగా చదువుకోగలరని ప్రశ్నించారు. పాఠాలు చెప్పేవారు లేనప్పుడు పరీక్షల్లో ఉత్తీర్ణత ఎలా సాధిస్తారన్నారు. సరైన తరగతి గదులు కూడా లేవన్నారు. కళాశాలలో అధ్యాపకులు నియమించాలి మరియు కళాశాలలో ఉన్నటువంటి హాస్టల్లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదు. భోజనం బాగోవడం లేదని చెప్తే కనీసం మార్చడం మానేసి బానే పెడుతున్నామని సమాధానం చెబుతున్నారు. కళాశాల హాస్టల్ వార్డెన్ సౌకర్యం కూడా లేదు. కావున హాస్టల్ కు వార్డెన్ నియమించాలి. అలాగే కళాశాలకు ప్రిన్సిపల్ నియమించాలి. గత సంవత్సరం నుండి క్లినిక్ కి తీసుకొని వెళ్లడం లేదు. కావున క్లినిక్‌కి తీసుకొని వెళ్ళాలి. విద్యార్థుల వద్ద రమ్య కళాశాల మేనేజర్ పితాని అన్నవరం విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. వారిపై కూడా చర్యలు తీసుకోవాల్సిందిగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థినులుగా డిమాండ్ చేశారు.అనంతరం కలక్టర్ కార్యాలయం బయట నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్లో కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టరేట్ నుండి డిఎంహెచ్‌వో ఆఫీస్ వర్క్ ర్యాలీ నిర్వహించి అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నరసింహ నాయక్‌కి ఇవ్వడం జరిగింది.

## వరద బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** ముంపు బారిలో ఉన్న జగనన్న కాలనీ వాసులకు జనసేన నాయకుడు బలిరెడ్డి గంగబాబు ఆధ్వర్యంలో పలువురు యువకులు గురువారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. గడిచిన వారం రోజులుగా కురుస్తున్న ఏకదాటి వర్షాలకు జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో గడచిన రెండు, మూడు రోజులుగా కాలనీ వాసులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న బిజీ యూత్ నాయకుడు బలిరెడ్డి గంగబాబు వెంటనే స్పందించి బాధితులకు ఆహారం పొట్లాలు అందజేశారు. బలిరెడ్డి గంగ బాబు యూత్ సభ్యులు అతి కష్టంపై జగనన్న కాలనీలోకి ప్రవేశించి ఇంటింటికి వెళ్లి ఆహారం అందించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు రహదారి లేక పడుతున్న ఇబ్బందులను గంగబాబుకు తెలిపారు. రహదారి మార్గం తరచూ ముంపుకు గురవుతుండడంతో అనేక సాధక బాధకాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన గంగ బాబు విషయాన్ని జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, కాకినాడ ఎంపీ, శ్రీనివాస్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలో బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బసా చిట్టిబాబు, మామిడాల సూరిబాబు, యూత్ నాయకులు నాని తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ ఏపీకి ఆశాజనకం

**- ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ కు ఆశాజనకంగా ఉందని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ పై ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రాజధాని అమరావతి నిర్మాణానికి బడ్జెట్లో రూ.15 వేల కోట్లు కేటాయించడంతోపాటు, ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు హామీ ఇవ్వడం, వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమన్నారు. అలాగే పూర్వోదయ పథకం ద్వారా ఏపీకి కొత్త ప్రాజెక్టులు ప్రకటించడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు.

## చెరుకుపల్లి నిత్య స్మరణీయులు - రాయప్రోలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జ్యోతిషరంగంతో పాటు ఆధ్యాత్మిక రంగంలోనూ విశేష కృషి చేసిన డా॥చెరుకుపల్లి లక్ష్మీనృసింహశర్మ నిత్య స్మరణీయులని పురోహితబ్రహ్మ పండిత రాయప్రోలు శర్మ అన్నారు. వేదవిజ్ఞన ప్రతిష్టానం మరియు అఖిలభారత జ్యోతిష సమాఖ్య రాజమండ్రి శాఖ సంయుక్తాధ్వర్యంలో స్థానిక రామారావుపేటలో నున్న ప్రతిష్టాన కార్యాలయప్రాంగణంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకలలో డా॥ చెరుకుపల్లి చిత్రపటానికి శిష్యబృందం భక్త్యాంజలి ఘటించారు. అనంతరం రాయప్రోలు ప్రసాదశర్మ, విశాఖ నగరానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితులు నిట్టల శివరామకృష్ణ, డా॥యాతగిరి పరుశురామ్ లను ఘనంగా సత్కరించారు. శ్రీరాయప్రోలు మాట్లాడుతూ జోతిషరంగంలో ఎందరినో తీర్చిదిద్దారని అదేవిధంగా వేదవాగ్మయ సంపదను భావితరాలవారికి అందించాలన్న సంకల్పంతో వేదవిజ్ఞాన ప్రతిష్టానాన్ని స్థాపించారని చెప్పారు. నిత్యము ఉచితంగా వేదవిద్యను భోదించడమే కాక సంస్కృతీ సంప్రదాయాలను నేర్పిస్తున్నామని వివరించారు. ప్రతీ సంవత్సరం వేదపరీక్షలు నిర్వహిస్తూ సమాజానికి పండితులను పరిచయం చేస్తున్నామని అన్నారు. డా॥ చెరుకుపల్లి ఆశయసాధనకు అంకితమయ్యామని చెప్పారు.

సమాఖ్య రాజమండ్రి శాఖ అధ్యక్షులు డా॥ పుసులూరి ఫణి శర్మ మాట్లాడుతూ ప్రాత:స్మరణీయులుగా గురుదేవులైన డా॥చెరుకుపల్లి నిత్యము ఆరాధిస్తామని చెమ్మగిల్లిన నేత్రాలతో ప్రసంగంలో ప్రస్తావించినపుడు అందరిలోనూ అదేభావన ప్రకటితమైయ్యింది. జ్యోతిష్య సభలను నిర్వహిస్తూ ప్రముఖులను నేటి తరానికి పరిచయం చేయడం ద్వారా విద్యార్థులకు ఈ రంగంలో అభివృద్ధికి దోహదపడ్డారని అన్నారు. ప్రతీ పౌర్ణమికి ఈ ప్రాంగణంలో హెూమాలు నిర్వహిస్తూ వాటి విశిష్టతను తెలియపరచడమే ప్రతిష్టానం ప్రధానాశయమన్నారు. పండిత నిట్టల శివరామకృష్ణ మాట్లాడుతూ జ్యోతిష్య రంగంలో మాకు మార్గదర్శకులన్నారు. జ్యోతిష్యంతో పాటు అనేక గ్రంధాలను రచించారని గుర్తుచేసారు. డా॥ పరశురామ్ మాట్లాడుతూ డా॥చెరుకుపల్లి శిష్యలు జ్యోతిష్య రంగంలో విశేష కృషి చేస్తున్నారని అన్నారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా ఈ రంగానికి చేసిన కృషి ఫలితంగా శాస్త్రీయ జ్యోతిష్యం నేడు సమాజానికి అందించబడిందన్నారు. అటువంటి మహనీయుని విగ్రహం లేకపోవడం విచారించదగ్గ విషయమన్నారు. అందరూ కలసి ఈ అంశాన్ని ఆలోచించాల్సిందిగా విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో మెగంటి కామేష్, దత్తాత్రేయ శర్మ, రాజేష్, సత్తిబాబు, నాగేశ్వరరావు, వేద విద్యార్థులు, శిష్యులు, పలువురు పాల్గొన్నారు.

## వెల్‌కమ్ మేడమ్ - నేడు కమిషనర్ బాధ్యతలు స్వీకారం





**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి భావన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 9.30-10.00 గంటల సమయంలో ఆమె విధుల్లో చేరనున్నారు. ప్రస్తుత కమిషనర్ జే.వెంకటరావు స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా మంగళవారం రాత్రి కాకినాడ చేరుకున్న కమిషనర్ భావనకు ప్రస్తుత కమిషనర్ జె.వెంకటరావు, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. కమిషనర్ వెంకటరావు ఇతర అధికారులను ఆమెకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, స్మార్ట్ సిటీ సూపరింటెడెంట్ ఇంజనీర్ వెంకటరావు, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, పలువురు డిఈలు, ఏఈలు కమిషనర్‌ను కలిసినవారిలో ఉన్నారు.

## విజయ్ దివస్ వేడుకలు కోసం కార్గిల్ యుద్ధ సైనికుల వివరాలు తెలపండి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 26న జరగబోయే విజయ్ దివస్ వేడుకలో కార్గిల్ యుద్ధంలో పోరాడిన మరియు పాల్గొన్న సైనికులను గౌరవించడం మరియు సత్కరించడం కోసం వారి వివరాలు అత్యవసరంగా అవసరం అయినవని, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ప్రతిఒక్కరు మరియు అటువంటి సైనికులను తెలిసిన వారు వారి వివరాలను జెడ్ఎస్‌డబ్ల్యూవో, కాకినాడకు అందించమని విజ్ఞప్తి చేస్తున్నట్లు కాకినాడ జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావుఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమాచారాన్ని ఇమెయిల్ zswoego@gmail.com కి లేదా టెలిఫోన్ 8688817825 ద్వారా తెలియజేయవచ్చున్నారు. ఈ సందేశాన్ని తమ తమ గ్రూపులలో వ్యాప్తి చేసి, అవసరమైనసమాచారాన్ని సేకరించి అందించవలసిందిగాఅన్నిమాజీ సైనిక సంఘాలను కోరుతున్నామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** పుల్లేటికుర్రు శివారు చినలంక ప్రధాన రహదరిలో మంగళవారం గుర్తు తెలియని మోటారు సైకిల్ ఢీ కొని ఇరువురి వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాచవరంకు చెందిన పితాని సూర్య నారాయణ, అతని సోదరు పితాని రామకృష్ణలు మోటారు సైకిల్‌పై కొత్తపేట నుండి అంబాజీపేట వైపు వస్తున్నారు. చినలంక వచ్చే సరికి ఎదురుగా గుర్తు తెలియని మోటారు సైకిల్ వారిని ఎదురుగా ఢీ కొట్టిందన్నారు. దాంతో సూర్యనారాయణ, రామకృష్ణలకు తీవ్ర గాయాలు కాగా 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు.

## తైక్వాండోలో గోల్డ్ మెడల్ సాధించిన చిన్నారి



**అంబాజీపేట, మేనేజర్ న్యూస్ :** ఇరుసుమండ సెయింట్ జోషప్ ఇంగ్లీష్ మీడియంలో 4వ తరగతి చదువుతున్న జె.జెస్సీలేఖన తైక్వాండలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 21వ తేదీన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో 30వ ఇంటర్ తైక్వాండో చాంపియన్ షిప్ 2024 జిల్లా స్థాయి పోటీలు జరిగాయి.

ఈ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో జెస్సీ లేఖన బంగారు పతకాన్ని కైవసం చేసుకుందని శ్రీనివాస తైక్వాండో క్లబ్ సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. అతి చిన్న వయస్సులో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల సెయింట్ జోషఫ్ ప్రిన్సిల్ సిస్టర్ హన్సీ అబ్రహం, కరస్పాండెంట్ రేణి, ఉపాధ్యాయులు, స్థానక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

- కలెక్టర్ షాన్ మోహన్ సగిలి పిలుపు
- రెండో రోజు స్వచ్ఛతా వారోత్సవాలు
- పాల్గొన్న కమిషనర్, అధికారులు





**కాకినాడ, మేజర్‌న్యూస్ :** పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య నియమాలు పాటించడంద్వారా అనేక సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి పేర్కొన్నారు. స్వచ్ఛత వారోత్సవాలలో భాగంగా రెండో రోజైన మంగళవారం స్థానిక ప్రతాప్ నగర్ వంతెన నుంచి ఇంద్రపాలెం జంక్షన్ వరకు పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. డివైడర్లు, ఇతర ప్రాంతాలలో పెరిగిన చెత్తను కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు స్వయంగా తొలగించి ప్రజలకు స్ఫూర్తినిచ్చారు. మార్గం మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని నిర్మూలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగాఉంచుకోవడంద్వారాఅనేకవ్యాధులకుదూరంగా ఉండవచ్చునన్నారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలు, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజల్లో మరింత అవగాహన కల్పించే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి నెలా చివరి వారంలో సోమవారం నుంచి శనివారం వరకు స్వచ్ఛత వారోత్సవాల పేరిట వివిధ ప్రాంతాలను శుభ్రం చేసే ప్రక్రియ చేపట్టామన్నారు. పిచ్చి మొక్కలు, చెత్త చెదరాన్ని తొలగించడం, రోడ్లపై ఉన్న భవన నిర్మాణ సామాగ్రిని నిర్మూలించడం, అవకాశం ఉన్నచోట్ల పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం వంటి అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. అలాగే ఖాళీస్థలాల్లో పెరిగిపోయిన చెత్తను కూడా తొలగింప చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో కాకినాడ నగరాన్ని క్లీన్ సిటీగా తయారు చేయాలన్నదే ప్రధాన కర్తవ్యమన్నారు.

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే. వెంకటరావు మాట్లాడుతూ స్వచ్ఛతా వారోత్సవాలలో అన్ని వర్గాల ప్రజలు, సేవా సంస్థలు, ఉద్యోగులు,విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎవరి ఇంటి పరిసరాలను వారే పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వ యంత్రాంగం చేసే కృషికి ఫలితం ఉంటుందన్నారు. ప్రధానంగా ఇంటింటికి చెత్త సేకరణలో భాగంగా ఇళ్లకు వచ్చే సిబ్బందికి తడి- పొడి చెత్తను వేరువేరుగా అందజేయాలని కమిషనర్ సూచించారు. ఈకార్యక్రమంలోస్మార్ట్‌సిటీ ఎస్‌ఈ వెంకటరావు, ఈ ఈ మాధవి, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, సానిటరీ ఇన్స్పెక్టర్ లాజర్,రవి వర్మ, టిడిపి నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు,తెలుగుదేశం, బిజెపి,జనసేన పార్టీలకు చెందిన నాయకులు,రోటరీక్లబ్‌ప్రతినిధులు,విద్యార్థులు,సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వి.వీర నాగిరెడ్డికి జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు వి.వీర నాగిరెడ్డి సిద్ధాంత వ్యాసం "ఏ క్రిటికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ మల్టీ-లెవెల్ యూజింగ్ ఏఐ కంట్రోలర్స్ ఫర్ పవర్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ ఇన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈయనకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగంలో లభించినది. వి.వీర నాగిరెడ్డి తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ ఇన్‌ఛార్జి డైరెక్టర్, అకడమిక్ ప్లానింగ్ (డిఏపి) & ఈఈఈ విభాగం ప్రొఫెసర్ డా.కె.వెంకటరెడ్డి మరియు నంద్యాలలోని రాజీవ్‌గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్&టెక్నాలజీ ఈఈఈ విభాగం ప్రొఫెసర్ డా.డి.వి.అశోక్ కుమార్ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

## ఫిర్యాదుదారులతో గౌరవంగా మెలగాలి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో గౌరవపూర్వకంగా మెలగాలని కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ లో ఎస్పీ సాధారణ తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి రికార్డుల నిర్వహణ తీరు, ఫిర్యాదుదారులతో సిబ్బంది మెలగవలసిన తీరు, వచ్చిన పిర్యాదులపై శాఖ పరంగా తీసుకున్న చర్యలు, గ్రామాలవారీగా పోలీసులు నిర్వహించే బీటింగ్ తదితర అంశాలను పరిశీలించారు. ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది ఎస్పీకి గౌరవవందనం చేసారు.

## వరద బాధితులకు ఎక్కడికిఅక్కడ వరద సహాయక చర్యలు

- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గానోరే వెల్లడి



**కూనవరం/చింతూరు, మేజర్ న్యూస్ :** కూనవరం మండలంలోని వరద బాధితులకు ఎక్కడికిఅక్కడ వరద సహాయక చర్యలు చేపట్టడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గానోరే పేర్కొన్నారు. మంగళవారం కూనవరం మండలంలోని పల్లూరు, గుంముగూడెం గ్రామాలలోని వరద సహాయక చర్యలపై ప్రాజెక్ట్ అధికారి పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే మాట్లాడుతూ వరద బాధితులకు బియ్యం, కూరగాయలు, కందిపప్పు, వంటనూనె ప్రతి వరద బాధిత కుటుంబాలకు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా వరద బాధిత కుటుంబాలతో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూనవరం మండలం తాసిల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో వరద బాధితుల సహాయక చర్యలపై సమావేశం నిర్వహించారు.

ఈ మండలంలోని వరద సహాయక చర్యలు ఎప్పటికప్పుడు పరిరక్షించి సమస్య ఉన్న అక్కడికి వెళ్లి ఆయా సమస్యలు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. వరద బాధితులకు సహాయ సహకారాలు అందించే విధంగా పడవలు ఎన్టీఆర్ ఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఎక్కడికి అక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

## చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడాలి

- పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు




**రామచంద్రపురం,మేజర్ న్యూస్ :** హసన్ బాద స్థానిక అంబేద్కర్ సమీకృత హాస్టల్‌లో భారత జాతీయ ఉద్యమ విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ 118వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి హాస్టల్ వార్డెన్ అబ్బిరెడ్డి శ్రీనివాస్, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, రామచంద్రపురం నియోజకవర్గం బీసీ సెల్ కన్వీనర్ కడలి రాంపండు, పిడిఎస్‌యు నాయకులు కరిపోతుల నవీన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్దేశించి పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి సిద్దు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ భారత స్వతంత్ర ఉద్యమంలో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన కొదమసింహం ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. ఆయన జన్మించి 118 సంవత్సరాలు ఆయన మరణించి 93 సంవత్సరాల అవుతున్నా నేటికీ అమరవీరులు ఆశించిన సమాజం రాలేదని, తెల్లదొరలు పోయి, నల్లదొరలు పాలన కొనసాగుతుందని, ఎంతోమంది దేశభక్తులు మాతృదేశం కోసం తమ విలువైన ప్రాణాలు అర్పిస్తే, నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు దేశాన్ని, దేశ సంపదలను, సహజ వనరులను స్వదేశీ, విదేశీ, బహుళ జాతి కంపెనీలకు తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కామ్రేడ్ చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్ లాంటి వీరులు అతి చిన్న వయసులోనే దేశం కోసం తమ విలువైన ప్రాణాలు అర్పించారని అటువంటి మహనీయుల అడుగుజాడల్లో యువతీ యువకులు పయనించాలని అన్నారు. నేడు విద్యారంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని, ఆ సమస్యలపై విద్యార్థులు రాజీలేని పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు బి.సంతోష్, ప్రేమ్ కుమార్, బి. జోసెఫ్, కిరణ్ కుమార్, ఎం.ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ ఏపి ప్రజలను నిరాశపరిచింది



- లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతా శ్యామ్

**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలను నిరాశ పరచిందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతా శ్యామ్ రవిప్రకాష్ పేర్కొన్నారు. ఈ బడ్జెట్ వల్ల పేద బలహీన వర్గాల ప్రజలకు గాని కార్మికులకు గాని వరిగేది ఏమిలేదని అన్నారు. అమరావతి నిర్మాణం కొరకు 15000 కోట్లు రూపాయలు కేటాయించి నష్టాలో నడుస్తున్న స్టీల్ ప్లాంట్ కు కనీసం నిధులు కేటాయించకపోవడం బాధాకరం అన్నారు. 25రకాల ఖనిజా ఉత్పత్తులపై సుంకన్ని తగ్గించడం కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా ఉందని తెలిపారు. దేశానికి మేధావులను తయారు చేసే విద్యార్థులను ప్రోత్సహించవలసినది పోయి వడ్డీపై రుణాలు ఇవ్వడం అంటే వారి జీవితాలతో ఆడుకోవడమే నని అన్నారు. మహిళా లకు కేటాయించిన బడ్జెట్ కంటి తుడుపు చర్య మాత్రమే అన్నారు. ఇది పేదల బడ్జెట్ కాదని కార్పొరేట్ సంస్థల బడ్జెట్ అని రవిప్రకాష్ పేర్కొన్నారు.

## లొల్ల లాకుల ఆధునీకరణకు రూ.60 కోట్లు నిధులు మంజూరు చేయాలి

- నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బండారు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గంలో సాగునీటి వ్యవస్థ ఆధునీకరణలో భాగంగా లొల్ల లాకుల అభివృద్ధికి 60 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యనందరావు కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆత్రేయపురం మండలంలోని లొల్ల లాకులు పునర్నిర్మించవలసిన ఆవశ్యకత గురించి వివరించారు. సుమారు 137 సంవత్సరాల క్రితం బ్రిటిష్ కాలంలో నిర్మించిన లొల్ల లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయని, కూలిపోయే ప్రమాదం ఉందని, అందువలన కోనసీమలో సాగునీటి వ్యవస్థ చిన్నాభిన్నమై అపార నష్టం చేకూరే అవకాశాలు ఉన్నాయని అసెంబ్లీలో ఆందోళన వెలిబుచ్చారు. కోనసీమ రైతాంగానికి సాగునీటి సరఫరాలో అతి ముఖ్యమైన లొల్ల లాకులు పునర్నిర్మించుకోవలసిన ఆవశ్యకతను బొబ్బర్లంక నుండి లొల్ల లాకుల మీదుగా రావులపాలెం హైవే రోడ్డుకు చేరుకొనుటకు ప్రధాన రహదారిగా నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతుంటాయని వివరించారు. కోనసీమలోని అయిదు నియోజకవర్గాలకు సంబంధించి సుమారు రెండు లక్షల ఎకరాల పంట పొలాలకు లొల్ల లాకుల ద్వారా సాగునీరు సరఫరా అవుతోందని, రైతులకు ఎంతో ప్రయోజకరమైనలొల్ల లాకులను పునర్నిర్మాణానికి సహకరించవలసినదిగా అసెంబ్లీలో ప్రభుత్వానికి ఎమ్మెల్యే బండారు విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి అజెండాతో నియోజవర్గ సమస్యలపైన, సాగునీటి సరఫరాలో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆసెంబ్లీలో ప్రస్తావించి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యానందరావు చేస్తున్న కృషి పట్ల కోనసీమ రైతాంగం నియోజకవర్గ నాయకులు, ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజలు పునరావాస కేంద్రాలకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** వరద ఉధృతి దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంతం గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే పునరావాస కేంద్రాలకి తీసుకొచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్న చర్యలను సహకరించాలని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ సూచించారు. మంగళవారం కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలోని గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అధికారులతో కలసి పర్యటించి వరద ఉధృతిపై తీసుకోవాల్సిన చర్యలు, గట్టు పటిష్టత కోసం చేపట్టిన చర్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాలు కారణంగా గోదావరి నది వరద ఉధృతి అధికంగా ఉందని, ఇప్పటికే ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేయడం జరిగిందన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు, వరదలు కారణంగా వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఏర్పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని, వైద్యుల సూచన మేరకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మద్దూరు లంకలో గోదావరి వరద నీరు గ్రామంలోకి చొరబడకుండా ఇసుక బస్తాలతో గట్టును పటిష్ఠం కోసం తీసుకున్న విధానాన్ని పరిశీలించి , అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రెంట్ సబ్ కలెక్టర్ అశుతో శ్రీవాత్సవ , టూరిజం అధికారి..స్వామి నాయుడు, తాసిల్దార్ కె. మస్తాన్ వివిధ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో ఏపికి ప్రాధాన్యం చంద్రబాబు ఘనతే



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద పేట వేయడం అనేది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనతే అని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి హర్షాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఏడాది బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ పునర్ నిర్మాణానికి రూ. 15,000 కోట్లు, ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టుకి అధిక నిధులు కేటాయింపు, వైజాగ్ చెన్నై పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి అధిక నిధులు కేటాయింపు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని ఎమ్మెల్యే శిరీష దేవి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతికి అనుభవజ్ఞుడైన పాలకుడు అవసరాన్ని గుర్తించి ప్రజలు అద్భుతమైన రీతిలో ఉమ్మడి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. ఇందుకు ప్రతిఫలం నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్లో లభిస్తున్న ప్రాధాన్యతే తార్కాణమని ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, తెలుగు యువత అధ్యక్షులు విజయభాస్కర్ అన్నారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి, రాష్ట్ర ప్రజలకు మంచి చేయడానికి ఉమ్మడి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే శిరీష దేవి పేర్కొన్నారు.

## చెరువులను తలపిస్తున్న పంట చేలు

- అధికారుల వద్ద వక్కలంక రైతులు ఆవేదన



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ఇటీవల కురిసన భారీ వర్షాలకు వరి పంట చేలుచెరువులను తలపించేల ఉన్నాయని ఆ నీటిని బయటకు తరలించే మార్గం లేదని అధికారుల వద్ద వక్కలంక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అయినవిల్లి- పసుపల్లి సరిహద్దు వద్ద ఉన్న వక్కలంక పంట భూముల్లోకి వర్షపు నీరు బారీగా చేరడంతో డాక్టర్ బీఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, పి.గన్నవరం ఏడీఏ ఎస్.జే.వి.రామమోహనరావు, తహసీల్దార్ జె. విమలకుమారి, ఎంపీడీఓ జి.సరోవర్, ఏఓ సీహెచ్ది. విజయ్కుమార్లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సుమారుగా వక్కలంకలో 50 ఎకరాలు వరి నాట్లు, 30 ఎకరాల్లో వరినారుమడులు వేశామని వర్షానికి నీటి మునిగిపోయాయన్నారు. ఈ చేల నుండి మురుగు నీరు దిగే పంట బోదెలు ఆక్రమణకు గురికాగా తూరలు శిథిలమైపోవడంతో ప్రతీ ఏటా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అయినవిల్లిలోని జోగివారిపేట వద్ద చెరువులు తవ్వడంతో పంట బోదెలు మూసుకుపోయయన్నారు. ప్రతీ ఏటా వర్షాలకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీరు వెళ్లే డ్రైనేజీ, పంట బోదెలను శుభ్రం చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పసుపల్లి, వక్కలంకకు చెందిన రైతులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. దీనిపై అధికారులు స్పందించి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పూడుకుపోయిన పంట బోదెలను శుభ్రం చేసి వరి చేలల్లో ఉన్న మురుకునీటిని తరలించేందుకు కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ బి.చంద్రమోహన్, పుల్లేటికుర్రు సెక్టార్ ఇరిగేషన్ ఏఈ బి.జయలక్ష్మి, ఏఈఓ డి.దుర్గారావు, రైతులు కె.రాంబాబు, సీహెచ్. సత్యనారాయణ, ఎ.వెంకన్న, జి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగిన పంట పొలాల సమస్యలను తక్షణం పరిష్కరించండి

- ఎమ్మెల్యే పంతం నానాజీ






**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామంలోని అవా భూములు సుమారు 360 ఎకరాలు గత ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల దిగువ కాలువలను గుర్రపు డెక్క మరియు పూడిక తీత పనులు చేయక నేడు ఆ భూములన్నీ నీట మునుగాయని స్థానిక రైతులు, నాయకులు కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు పంతం నానాజీ దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. అలాగే వారి సొంత నిధులతో గత నెల రోజులుగా జరుగుతున్న గుర్రపు డెక్క మరియు పూడిక తీత చేస్తున్న మిషన్ ను పంపిస్తానని అధికారులకు చెప్పారు. అధికారులు వెంటనే ఆ పనులను ప్రారంభించి గుర్రపు డెక్క మరియు పూడిక తీత పనులు చేపట్టి వర్షపు నీటిని దిగువకు వెళ్ళేలా చర్యలు చేపట్టారు. మంగళవారం ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ స్థానిక రైతులు, కూటమి నాయకులతో కలిసి ఆ పనులను పరిశీలించారు.

## ముక్కామల శాఖ గ్రంథాలయంలో వార్షిక తనిఖీలు

- తనిఖీలు నిర్వహించిన జిల్లా కార్యదర్శి ఎం శేఖర్ బాబు



**పెరవలి, మేజర్ న్యూస్ :** ముక్కామల గ్రామం లోని శ్రీ ఇనపకోళ్ల రాఘవరావు మెమోరియల్ శాఖ గ్రంథాలయంలో వార్షిక తనిఖీ నిమిత్తం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్ బాబు జూన్ 23వ తేదీ మంగళవారం గ్రంథాలయానికి వచ్చి రికార్డులు తనిఖీలు నిర్వహించారు. గ్రంథాలయం ఆవరణ అంతా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

# కాకరపర్రు అంగన్వాడి కేంద్రంలో భేటీ బచావో బేటి పడావో



**పెరవలి, మేజర్ న్యూస్ :** కాకరపర్రు గ్రామంలో జూలై 23వ తేదీ మంగళవారం స్థానిక సొసైటీ దగ్గర్లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో భేటీ బచావో బేటి పడావో కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంగన్వాడి సూపర్వైజర్ సిహెచ్ లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ పిల్లల అక్రమ రవాణా జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎటువంటి లింగ వివక్షత లేకుండా ఆడపిల్లను మగ పిల్లలు ఒకే రకంగా పెంచాలని తల్లిదండ్రులకు హితవు పలికారు. ప్రస్తుత వాతావరణ దృశ్య స్టాప్ డయేరియాకార్యక్రమంలో భాగంగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని మరియు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు సహాయకురాలు పాల్గొన్నారు.

# వెంకన్న సన్నిధిలో నటుడు సత్య ప్రకాష్ పూజలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని మంగళవారం సినీ నటుడు సత్య ప్రకాష్ దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయనకు ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

# మహనీయులే మార్గదర్శకం కావాలి

**- డాక్టర్ బి.ఈ.వి.ఎల్.నాయుడు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో లోకమాన్య బాలగంగాధర తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ ల జయంతి వేడుకలు నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా.బి.ఇ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు. "స్వరాజ్యం నా జన్మహక్కు.. దాన్ని సాధించితీరుతాను' అంటూ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో స్వరాజ్య వాధాన్ని వినిపించిన జాతీయ వాధి లోకమాన్య బాలాగంగాధర తిలక్ మరియు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుండి తరిమికొట్టవచ్చునని నమ్మి అది ఆచరణలో పెట్టిన మహనీయుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగాయి. ఈసందర్భంగా లోకమాన్య బాలగంగాధర



తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటాలకు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు పూలమాలలు వేసి నమస్కరించారు. తదుపరి ఆయన మాట్లాడుతూ ప్రజలలోజాతీయస్ఫూర్తిరగిల్చేందుకువీలున్న అవకాశాలన్ని వదలకుండా గణపతి, శివాజి ఉత్సవాలు నిర్వహించి ప్రజలను సమీకరించి వారిని జాతీయోద్యమం వైపు నడిపించిన మహనీయులు తిలక్ అని, దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన వీరుడు, గొప్పదేశభక్తుడు, నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన మహోన్నత వ్యక్తి చంద్రశేఖర్ఆజాద్ అని ఇటువంటి ప్రముఖులు నేటి యువతకు మార్గదర్శకమని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

మహానుభావులజయంతివేడుకలునిర్వహించడంమంచి సంప్రదాయమని ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్. బృందాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డా.ఎన్. శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ ఎన్. సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్చార్జ్ ఎన్.మూర్తి,ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకరరావు, గౌరీ ప్రియ , ఎస్వీఆర్ ప్రభాకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గాయపడిన పలువురికి జనసేన చెక్కులు పంపిణీ...



కొత్తపేట, మేజర్ న్యూస్ : మండలంలో ఇటీవలే ప్రమాదవశాత్తు గాయపడిన జనసేన పార్టీకి చెందిన నలుగురు కార్యకర్తలకు ప్రమాద భీమా చెక్కులను నియోజకవర్గ జనసేన ఇంఛార్జి బండారు శ్రీనివాస్ పంపిణీ చేశారు. రాకుర్తివారి పాలెంనికి చెందిన అన్యం నారాయణ మూర్తి రూ.20,500,వాకాడవారి పాలెంనికి చెందిన బల్ల ప్రసాద్ రూ.26,000,అలాగే కొత్తపేట గ్రామంలో శ్రీఖాకోళపు గుప్తా రూ.13,273, ఏనుగులమహల్ కి చెందిన సలాది వీరబాబు రూ.12,289 చెక్కులను వారివారి ఇళ్ల వద్దకు వెళ్ళి క్రియాశీలక కార్యకర్తలకు వైద్య ఖర్చుల నిమిత్తం జనసేన క్రియాశీలక సభ్యత్వం ద్వారా మెడికల్ ఇన్సూరెన్స్ చెక్కులను జనసేన అధ్యక్షులు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శ్రీనివాస్ తన చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల కోసం అధినేత పవన్ కళ్యాణ్ అద్భుతమైన ఆలోచన చేశారని కొనియాడారు. ఆయన మనసులో నుంచి పుట్టిన గొప్ప ఆలోచనతో ఎంతోమందికి మేలు జరుగుతోందన్నారు. కార్యకర్తలకు భద్రత, భరోసా కల్పించే క్రియాశీలక సభ్యత్వం పవన్ గొప్ప ఆలోచనన్నారు. ఈనెల 28 తేదీ వరకు జనసేన క్రియాశీలక సభ్యత్వం కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరుగుతుందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొక్కా ఆదినారాయణ,మండల అధ్యక్షులు కంఠంశెట్టి చంటి,పల్లికొండ సుధీర్,మైగాపుల భూషణం, వక్కపట్ల శేఖర్, చోడపనీడి ఉమామహేశ్వరరావు, కార్యకర్తలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులు అధైర్య పడవద్దు ఫోన్ చేస్తే పడవలు ఏర్పాటు చేస్తాం

**- కూనవరం ఎస్సై**



**కూనవరం, మేజర్ న్యూస్ :** వరద బాధితుల కోసం ఎన్ డి ఆర్ ఎఫ్ సహాయంతో వారి బోట్లతో వైద్య అవసరాల నిమిత్తం ప్రజలను కోతులు గుట్ట హాస్పిటల్‌కి తరలించడం జరుగుతుంది. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో మెడికల్ అవసరాల నిమిత్తం లేదా ఎవరైనా వరదల్లో చిక్కుకున్న పక్షంలో తాసిల్దార్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కిగాని లేదా నాకు గాని ఫోన్ చేయవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం ఎవరు అధైర్యపడ వలసిన పని లేదు అత్యవసర పరిస్థితిలో సేవలు అందించుటకు గాను ఎన్డీఆర్ఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు ఎల్లప్పుడూ వరద బాధితులకు అండగా ఉంటారని ఆయన తెలిపారు.

## భీమేశ్వరాలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ భీమేశ్వరాలయంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. పెద్దాపురం నియోజక వర్గం పర్యటనలో భాగంగా ఉదయం 11 గంటలకు ఆయన భీమేశ్వరాలయానికి విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కార్యనిర్వాహనాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ భీమేశ్వర స్వామిని, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా మొదటిగా ఆలయానికి విచ్చేసిన కలెక్టర్‌కు ఆలయ నంది మండపంలో పండితులు ఆశీర్వచన పూజలు జరిపించి ఆశీర్వదించారు. ఈ పూజల్లో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, విఆర్వో లు, ఆలయ అర్చకులు ఉన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో ఏ.పీ.కి నిధులు కేటాయింపుపై హర్షం



**అంబాజీపేట,మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన 2024-25 కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి అభినందనీయమని పి.గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. జూన్ నెలలో కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత ఈ రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని ప్రజలందరూ భావించడం జరిగింది. గత ఐదు సంవత్సరాలలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో తీవ్రంగా నాశనం చేసిందని అన్నారు. ఏ.పి. అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రావాలని ప్రజలు ఆకాంక్షించి రాష్ట్రంలో భారీ మెజార్టీ కట్టబెట్టారని అన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు కేంద్ర ప్రభుత్వంలో ప్రధానమంత్రి మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతికి 15 వేల కోట్లు కేటాయించడం కానీ, రాజధాని నిర్మాణానికి అవసరం మేరకు ఇంకా నిధులు ఇస్తానని హామీ ఇవ్వడం, అదేవిధంగా పోలవరం ప్రాజెక్ట్ త్వరితగతిన పూర్తి చేయడానికి నిర్ణయించడం, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించడం, పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి అన్ని వనరులు సమకూర్చడానికి నిర్ణయించడం, కోస్టల్ కారిడార్లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయుటకు,అన్ని రకాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన కేంద్ర ప్రభుత్వ నాయకులకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. ఈ సందర్భంగా సహకరించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరిలకు ధన్యవాదాలు తెలిపారు.

# వరద ముంపు రాకుండా ఇసుక బస్తాలను వేసి

**ఏటిగట్టు పట్టిష్టత చేసిన విధానాన్ని పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్**



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** వరద ఉధృతి దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంతం గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తుగా ఉండాలని , ఎటువంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే పునరావాస కేంద్రాలకి తీసుకొచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్న చర్యలను సహకరించాలని జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ సూచించారు. మంగళవారం కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలోని గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను జాయిం ట్ కలెక్టర్ తేజ్ భరత్ అధికారులతో కలసి పర్యటించి వరద ఉధృతిపై తీసుకోవాల్సిన చర్యలు, గట్టు పటిష్టత కోసం చేపట్టిన చర్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాలు కారణంగా గోదావరి నది వరద ఉధృతి అధికంగా ఉందని, ఇప్పటికే ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేయడం జరిగిందన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తగా ఉండాలన్నారు. వర్షాలు, వరదలు కారణంగా వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఏర్పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని, వైద్యుల సూచన మేరకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మద్దూరు లంకలో గోదావరి వరద నీరు గ్రామంలోకి చొరబడకుండా ఇసుక బస్తాలతో గట్టును పటిష్ఠం కోసం తీసుకున్న విధానాన్ని పరిశీలించి, అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రెంట్ సబ్ కలెక్టర్ అశుతో శ్రీవాత్సవ, టూరిజం అధికారి స్వామి నాయుడు, తాసిల్దార్ కె. మస్తాన్ వివిధ అధికారులు సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

## అల్కాట్ గార్డెన్ పునరావాస కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ప్రశాంతి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఎదుర్లమ్మలంక, కేతవారిలంక కు చెందిన 248 మందికి మునిసిపల్ కళ్యాణ మండపంలో పునరావాసం కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం అల్కాట్ గార్డెన్ - మునిసిపల్ కళ్యాణ మండపం పునరావాస శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పునరావాసం కల్పించిన లంక గ్రామాల ప్రజలతో మాట్లాడడం జరిగింది. గోదావరీ నదికి పై నుంచి పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ఇక్కడికి తరలించనున్నారు. వరద ఉధృతి తగ్గే వరకు ఈ శిబిరంలో ఉండాలని, అధికారులు సూచనలు అనుసరించి సహకరించాలన్నారు. పునరావాస కేంద్రంలో అందిస్తున్న సేవల వివరాలు తెలుసుకున్నారు. శానిటరీ నిర్వహణా విషయంలో అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పునరావాస కేంద్రంలో ఉన్న వారికీ వేడి నీళ్లు అందించడం, మహిళలకు, పురుషులకు ప్రత్యేక వసతీ సదుపాయాలు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వైద్య శిబిరంలో అందుబాటులో ఉంచిన మందుల వివరాలు, చికిత్స తదితర వివరాలు తెలుసుకున్నారు. దోమల నివారణ కు సంబంధించి పిచికారి చేపట్టాలని, వేడిగా ఉన్న ఆహారం అందచేయాలని ఆదేశించారు.

# మంచినీటి సరఫరా ఇబ్బందులపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమీక్ష

**- అంటువ్యాధులు వ్యాపించకుండా నగర ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి**
**- సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గోదావరి వరదల కారణంగా రాజమహేంద్రవరం సిటీలో ఏర్పడిన మంచినీటి సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) నగరపాలక సంస్థ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతూ ఉన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విజయవాడలో ఉన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రజల ఆరోగ్యం, సమస్యల పట్ల నిరంతరం అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో గత రెండు రోజులుగా ఉన్న మంచినీటి సరఫరాలో ఇబ్బందులపై నిరంతరం అధికారులతో మాట్లాడుతూ ఇబ్బందులు తొలగేలా చర్చిస్తున్నారు. గోదావరి వరద ప్రవాహం విపరీతంగా పెరగడం, హెడ్ వాటర్ వర్క్స్,కోటిలింగాల రేవు వద్ద ఉన్న 10 ఏం ఎల్ డి వాటర్ ప్లాంట్ వద్ద రా వాటర్ తీసుకునే పంపుల్లోకి చెత్త వెళ్లిపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ వాటి పరిష్కారానికి పలు సూచనలు చేశారు. నగర పాలక సంస్థ అధికారులు సైతం జోరు వానలో కూడా ప్రజలకు ఎదురైన మంచినీటి సరఫరా విషయంలో నీటిలో దిగి చెత్తను తొలగిస్తూ మంచినీటిని అందించే విషయంలో తమ వంతు కృషి చేస్తున్నారు. రేపటిలోగా ఈ సమస్యకు పరిష్కారం లభించేలా సిబ్బంది, అధికారులు పని చేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు వచ్చే ఇబ్బందులను సత్వరం పరిష్కరించాలని నగరపాలక సంస్థ అధికారులు కూడా అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కొత్తనీరు వచ్చినందున మంచినీరుని కాచి చల్లార్చుకుని తాగాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ( వాసు) సూచించారు.

# పోలవరం నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజ్, పునరావాసం కల్పించాలి

**- సిపిఐ డివిజన్ కార్యదర్శి మోహన్ రావు**

**కూనవరం, మేజర్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి భూములు ఇచ్చిన నిర్వాసితులకు పునరావాసం, ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వడం మర్చిపోయిందని, వెంటనే ఇవ్వాలని చింతూరు డివిజన్ సి పి ఐ పార్టీ కార్యదర్శి గుజ్జా మోహన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వ వచ్చినా, అధికారులు వచ్చిన పోలవరం నిర్మాణం గురించి ప్రస్తావిస్తున్నారే గాని, నిర్మాణానికి తమ ఉనికిని ఫణంగా పెట్టిన నిర్వాసితులకు పునరావాసం, ప్యాకేజీ ఇవ్వడంలో ప్రభుత్వం గత పది సంవత్సరాల నుండి తశ్చారం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ప్రతి నిర్వాసితునికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, అలాగే 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఆర్ఆర్ ప్యాకేజీ 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సారవంత భూములు కోల్పోయిన పశ్చిమగోదావరి జిల్లాలో ఎకరానికి 36 లక్షల రూపాయలు ఇచ్చి తమకు మాత్రం ఎకరానికి లక్ష 15 వేల రూపాయలు ఇచ్చి అన్యాయం చేశారని పేర్కొన్నారు. ఈ విధంగా చింతూరు ,విఆర్ పురం కూనవరం ,ఎటపాక మండలాల్లోని అనేకమంది భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ముంపుకు గురయ్యే గ్రామాలకు సమీపంలోనే ఎత్తయిన ప్రదేశాల్లో పునరావాస కాలనీలు నిర్మించాలని కోరారు. ముందు ఖమ్మం జిల్లా, విభజన తర్వాత తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం అల్లూరు సీతారామరాజు జిల్లా ఇలా జిల్లాలు మార్చే గాని నిర్వాసితుల బ్రతుకులతో ఆటలాడుకుంటుందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పునరావాస చర్యలు చేపట్టి, ఆర్ఆర్ ప్యాకేజీలు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సహాయ కార్యదర్శి ఎస్కే రంజాన్ పాల్గొన్నారు.

## వరదల సమయాల్లో పాముల నుండి పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలి

**- వెటర్నరీ డిడి డా.రాధాకృష్ణ**



**పెరవలి, మేజర్ న్యూస్ :** వరదలు సమయాల్లో వరద నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చే పాములు ఇతర కేటకాలతో పశువులకు హాని కలిగే ప్రమాదం ఉందని కావున రైతులు తమ పశువులను వాటి బారిన పడకుండా ఏటిగట్టు పైకి ఇతర సురక్షత ప్రాంతాలకు తరలించాలని వసు వైద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాధాకృష్ణ స్థానిక పాడి రైతులకు అవగాహన కల్పించారు. జూలై 23వ తేదీ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో గోదావరి ఏటి గట్టు వద్ద గోదావరి లంకలో పాడి రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన గోదావరి ఒకర రూపం దాల్చినందున గోదావరి వరద ముంపునకు గురైన లంకలలోను, ఏటి గట్టు, పల్లపు ప్రాంతాలలో వున్న పశు వులన్నిటినీ ఒడ్డుకుతీసుకురావాలని, పశువులకు వ్యాక్సిన్ వేయించుకోని వారు ఎవరైనా వుంటే గొంతు వాపు మరియు జబ్బ వాపు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని, పశువులకు ఏమైనా అత్యవసర పరిస్థితి వస్తే రైతులందరూ తమ తమ పశువులకు వెంటనే చికిత్స అందించేలా ఎల్ల వేళలా అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించడం జరిగింది. గతంలో తమ పశువులకు వ్యాక్సిన్ వేయించుకోని వారి పశువులకు ఈరోజు వ్యాక్సిన్లు వేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రిషి ప్రసాద్ పెరవలి పశు వైద్యాధికారి డాక్టర్ చరణ్ ఫణీంద్ర,ఖండవల్లి పశువైద్యాధికారి డాక్టర్ సల్మా మరియు రైతులు పాల్గొన్నారు.

## న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ 106వ వార్షికోత్సవ వేడుకలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రారంభించి 105 సంవత్సరాలు పూర్తయి 106వ సంవత్సరంలో అడుగిడిన సందర్భంగా న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ తణుకు బ్రాంచ్లో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ తణుకు బ్రాంచ్ మేనేజర్ ఎం జె నంద కేకు కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారులు, సిబ్బంది, ఏజెంట్లు, ఆయనకు శు భాకాంక్షలు తెలియజేశారు. న్యూ ఇండియన్ ఇన్సూరెన్స్ కంపెనీ తణుకు బ్రాంచ్ ఏజెంట్ బొలిశెట్టి రామనాథ్ మాట్లాడుతూ మేనేజర్‌గా ఎం జె నంద వచ్చిన తర్వాత ఖాతాదారులకు మరిన్ని మంచి సేవలు అందిస్తున్నారని కొనియాడారు.


## మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

**- నన్నయ ఇన్చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు**



**రాజానగరం, మేజర్ న్యూస్ :** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్‌లో మంగళవారంలోకమాన్య బాలగంగాధర్ తిలక్, చంద్ర శేఖర్ ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఇన్చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు హాజరై వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్వాతంత్ర్యం నా జన్మ హక్కు' అంటూ గర్జించిన మహనీయుడు తిలక్ అని గుర్తు చేశారు. విద్య గొప్పతనాని ఎరిగిన తిలక్ పాఠశాలలు నడిపారని, పత్రికలు నడిపారని, గీతా రహస్యం లాంటి మహోన్నత గ్రంథాలు రాశారని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమంలో దేశమాత విముక్తి కోసం భగత్ సింగ్ రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైల్లు పరిగెత్తించి, సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ అజాద్ అని గుర్తు చేశారు. భారతదేశం కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకొని మనమంతా జీవించాలన్నారు. అటువంటి మహనీయుల త్యాగాల ఫలితమే నేటి భారతదేశమని, అందరూ బాధ్యతగా తమ విధులు నిర్వహిస్తూ దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వరద బాధితుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ ప్రారంభించిన నోడల్ ఆఫీసర్



**కూనవరం,మేజర్ న్యూస్ :** వరద బాధితులకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేసిన వి ఆర్ పురం నోడల్ అధికారి ఎస్ ప్రశాంత్ కుమార్ ఐఏఎస్ఆ పిఆర్ పురం మండలంలోని శ్రీరామగిరి ధర్మతాల గూడెం వడ్డీ గూడెం నిర్వాసితుల కుటుంబాలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేసిన అధికారులు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సిఐ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
బుధవారం, 24 జూలై 2024


## నేడు మరిడమ్మ అమ్మవారి హుండీల లెక్కింపు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారు ఆషాఢ మాసం జాతర మహోత్సవాలలో భాగంగా బుధవారం దేవస్థానంలో ఉదయం 8 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించబడునని దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహనరావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ, ధర్మదాయ శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖాధికారులు పాల్గొననున్నారు.



## శాకంబరీగా శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారు

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారు ఆషాఢ మాసం జాతర మహోత్సవాలలో భాగంగా మంగళవారం శాకంబరీగా అమ్మవారు దర్శనమిచ్చారు. దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి సిహెచ్.రామ మోహనరావు పర్యవేక్షణలో భక్తులు, దేవస్థాన సిబ్బంది ఆధ్వర్యంలో శాకంబరీగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచం ద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్,లోవ, శివ భక్తులు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమీషనర్ తెలుపుతూ ఈ శాకంబరి అలంకరణకు కూరగాయలను శ్రీ లక్ష్మీ షాపింగ్ మాల్ అధినేతలు కూరగాయలను సమర్పించినట్లు తెలిపారు.

# పెద్దాపురం నియోజవర్గంలో కలెక్టర్ షాన్‌మోహన్ విస్తృత పర్యటన

**– పలు అభివృద్ధి పనులు పరిశీలన**

**– అధికారులకు పలు సూచనలు**

**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** వర్షాకాలంలో ఎదురయ్యే వ్యాధులను నివారించేందుకు జిల్లాలోని అన్ని ఆవాసాల్లో పరిశుభ్రత, తాగునీటి క్లోరినేషన్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. వివిధ శాఖల అధికారులతో కలిసి సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో ఎస్డబ్ల్యూపీసీ,తాగు నీరు క్లోరినేషన్, ఇరిగేషన్, పాఠశాలల్లో నాడు– నేడు పనులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడి,బీసీవసతిగృహాలువంటిఅంశాలపైవిస్తృతంగా పర్యటించారు. తొలుత ఆయన సామర్లకోటలో ప్రముఖ పంచారామ క్షేత్రం శ్రీ చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయ పండితులు వేద మంత్రాలతో జిల్లా కలెక్టర్‌కు ఆశీర్వాచనాలు అందజేశారు.అనంతరంసామర్లకోటమండలం అచ్చంపేట గ్రామంలోని ఎస్డబ్ల్యూపీసీ షెడ్ ను, వర్మి కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించి, ప్రతిరోజు గృహాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానం, వర్మికంపోస్టు వినియోగం వంటి అంశాలను అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అచ్చంపేట గ్రామం కాపు కళ్యాణమండపం వద్దనున్న సురక్షితమంచినీరు ట్యాంకు వద్ద క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించి, క్లోరినేషన్ ప్రక్రియనుఅన్నిగ్రామాల్లో సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఉండూరు గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించి, పాఠశాల విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్నం భోజనంనాణ్యతనుస్వయంగాభుజించి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, మరుగుదొడ్డులోని శుభ్రత,పాఠశాల ఇతరఅవసరాలను, మౌళిక సదుపాయాల వివరాలను డీఈవో పీ.రమేష్ ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మేనూ ప్రకారం మాధ్యహ్నం భోజనం నాణ్యతతో విద్యార్థులకు అందిచాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అనంతరం సామర్లకోట పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో జనరేటర్ పనితీరు, పురుషుల వార్డు, ఫార్మసీ, అవుట్ పెసెంట్స్ వివరాలు తదితరాల వివరాలుఆరాతీశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య అధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం హుస్సేన్ పురం, వేట్లపాలెం రోడ్ వద్ద ఇరిగేషన్ కాలువలో గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. అదేవిధంగా వేట్లపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. విద్యా శాఖ అధికారులతో కలిసి పరిశీలించి, నిర్మాణ పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పెద్దాపురం మండలం జి.రాగంపేట హౌసింగ్ కాలని సందర్శించారు. కాలని వాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జల జీవన్ మిషన్ పనుల పురోగతిని హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో త్వరలోనే సిసి రోడ్లు, డ్రైన్స్, ఇతర ప్రభుత్వ భవనాలు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని కాలని వాసులకు జిల్లా కలెక్టర్ వివరించారు పులిమేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముసలమ్మ గుడి దగ్గర ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. వైద్య ఆరోగ్యం, ఐసీడీఎస్ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అంగన్వాడి కేంద్రం ద్వారాగర్భిణీ,బాలింతలకు,చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారం పంపిణీ వివరాలును లబ్ధిదారులతో మాట్లాడి





తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పాలు, కోడి గుడ్డు, ఇతర పౌష్టికాహారంరక్తహీనత వారినుండి తప్పిస్తుందని, గర్భిణీలు బాలింతలు, చిన్నారులు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవాలన్నారు.అనంతరం కాండ్రకోటలో కోతకు గురఅవుతన్న దబ్బ కాలువ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్.. ఇరిగేషన్, డ్రైన్స్, స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. త్వరితగతిన రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం పెద్దాపురం పట్టణంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలోని సదుపాయాలను ఆయన తనిఖీ చేశారు. తాగునీరు, మరుగుదొడ్లులో పరిశుభ్రతను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వివిధ శాఖలకు సంబంధించిన కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలన్నారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.ప్రాముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే వ్యాధులను నివారించేందుకు జిల్లాలోని అన్ని ఆవాసాల్లో పరిశుభ్రత, తాగునీటి క్లోరినేషన్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులకు సూచించారుఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి కె. భారతి సౌజన్య, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, గ్రౌండ్ వాటర్ డీడీ, సామర్లకోట మండల ప్రత్యేక అధికారి పీ.రాధాకృష్ణ, డీఎం హెచ్వో డా.జె.నరసింహ నాయక్, డీసీహెచ్ఎస్ డా కె.స్వప్న, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, బీసీ సంక్షేమ అధికారి ఎంలల్లి,ఏపీఈడబ్లుఐడీసీ,ఆర్డబ్ల్యూఎస్ఇంజనీరింగ్ అధికారులు, సామర్లకోట, పెద్దాపురం మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత, తాగునీటి క్లోరినేషన్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలి

**– జిల్లా కలెక్టర్ షాన్ మోహన్**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** వర్షాకాలంలో ఎదురయ్యే వ్యాధులను నివారించేందుకు జిల్లాలోని అన్ని ఆవాసాల్లో పరిశుభ్రత, తాగునీటి క్లోరినేషన్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.. వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలోని ఎస్డబ్ల్యూపీసీ షెడ్ ను, వర్మి కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించి, ప్రతిరోజు గృహాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానం, వర్మికంపోస్టు వినియోగం వంటి అంశాలను అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అచ్చంపేట గ్రామం కాపు కళ్యాణమండపం వద్దనున్న సురక్షిత మంచినీరు ట్యాంకు వద్ద క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించి, క్లోరినేషన్ ప్రక్రియను అన్ని గ్రామాల్లో సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఉండూరు గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించి, పాఠశాల విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్నం భోజనం నాణ్యతను స్వయంగా భుజించి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, మరుగుదొడ్డులోని శుభ్రత, పాఠశాల ఇతర అవసరాలను, మౌళిక సదుపాయాల వివరాలను డీఈవో పీ.రమేష్ ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మేనూ ప్రకారం మాధ్యహ్నం భోజనం నాణ్యతతో విద్యార్థులకు అందిచాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అనంతరం సామర్లకోట పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో జనరేటర్ పనితీరు, పురుషుల వార్డు, ఫార్మసీ, అవుట్ పెసెంట్స్ వివరాలు తదితరాల వివరాలుఆరాతీశారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి కె. భారతి సౌజన్య, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, గ్రౌండ్ వాటర్ డీడీ, సామర్లకోట మండల ప్రత్యేక అధికారి పీ.రాధాకృష్ణ, డీఎం హెచ్వో డా.జె.నరసింహ నాయక్, డీసీహెచ్ఎస్ డా కె.స్వప్న, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, బీసీ సంక్షేమ అధికారి ఎం లల్లి, ఏపీఈడబ్లుఐడీసీ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సామర్లకోట, పెద్దాపురం మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలుఇతరఅధికారులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

- బుల్లబ్బాయి రెడ్డి నగర్ సమస్యలను ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకువచ్చిన స్థానిక నాయకులు
- వెంటనే స్పందించిన ఎమ్మెల్యే






**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామ బుల్లబ్బాయిరెడ్డి నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగు నీరు (ఫిల్టరేషన్), రోడ్లు, డ్రైనేజీలు మరియు పారిశుధ్యం సమస్యల గురించి స్థానిక నాయకులు కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు పంతం నానాజీ దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే పంతం నానాజీ వెంటనే స్పందించి సంబంధిత అధికారులను ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రామానికి కావలసిన రోడ్డు సదుపాయం, డ్రైనేజీలు త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పంతం నానాజీ గ్రామ ప్రజలకు భరోసానిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ కూటమి నాయకులతో కలిసి ఆ పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు, కూటమి నాయకులు తదితరులు ఉన్నారు.

## పెరవలి మండలంలో ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ పి. ప్రశాంతి

- తక్షణ రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశం
- రైతులెవరు అధైర్య పడవద్దు మీ వెంట మేముంటాం
- ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందేలా చూడాలి
- డ్రైనేజీల్లో గుర్రపు డెక్క తీసిమురుగునీరు పోయేలా మార్గం కల్పించాలి
- రైతుల పంట నష్టం వివరాలు వ్యవసాయ అధికారులు వెంటనే సేకరించాలి



**పెరవలి, మేజర్ న్యూస్ :** రైతులెవరు అధైర్య పడవద్దని మీ వెంట మేముంటామని మునిగిన పంటచేలలో మురుగునీటిని వెంటనే తగ్గించే చర్యలు తీసుకుంటున్నామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి కానూరు నడిపల్లి పెండ్యాల గ్రామాల రైతులకు ధైర్యం చెప్పారు.తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు, నడిపల్లి, పెండ్యాల గ్రామాల్లో జూలై 23వ తేదీ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి పర్యటించి మునిగిన పంట చేలు అందుకు కారణమైన డ్రైనేజ్ కాలువలను పరిశీలించారు. కానూరు గ్రామంలో 25 ఎకరాల వరి పంటచేలు మునిగినవని అధికారులు ఆమెకు తెలియజేశారు. మురుగు కాలువల్లో జెసిబిలతో ప్రత్యేకమిషన్లతో వెంటనే గుర్రపు డెక్క తీయించాలనికాలువలలో ఎక్కడకూడా నీరు నిలవకుండా చూడాలన్నారు. భవిష్యత్తులో పంట చేలు నీటిముంపుకు గురికాకుండా తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు.నీటిముంపునివారణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు.గ్రామస్తులకు సురక్షితమైన క్లోరియేషన్ చేసిన త్రాగు నీటిని అందించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ మండల ప్రత్యేక అధికారి సునీల్ వినయ్, తాసిల్దార్ డి సుధ, ఎంపీడీవో కేహిమామహేశ్వరి, ఇతర అధికారులతో పాటు కానూరు గ్రామ సర్పంచ్ భావనమధుపూర్ణ చందు, నడిపల్లి గ్రామ సర్పంచ్ బీరా సత్యవేని రాజు, వాకలపూడి వీర్రాజు, ముల్లపూడి రాజేంద్రప్రసాద్, కోలా సీతయ్య నాయుడు, బూరుగుపల్లి రాజు, జజ్జవరపువెంకట సత్యనారాయణ, రంకి రెడ్డిప్రసాద్,తదితరులతో తోపాటు కానూరు నడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే వినియోగదారులకు నిత్యవసర సరుకులు అందించాలి


**– కలెక్టర్ పి.ప్రశాంతి**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** పేద మధ్యతరగతి ప్రజలకు నిత్యావసర సరుకులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాల్సి ఉందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో "ధరల పర్యవేక్షణ కమిటి సమావేశం జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ నిత్యావసర సరుకులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని ఆ విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి షాప్ వద్ద ధరల పట్టికను వినియోగదారులకు తెలిసేలా ప్రదర్శించాలన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం నిత్యావసర సరుకులు ధరలు పెరిగిన నేపథ్యంలో అధిక ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నందున, రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా బియ్యం, కందిపప్పు ను సరసమైన ధరలను నిర్ణయించి ఆమేరకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అదేవిధంగా జిల్లాలో నిత్యవసర సరుకులు బియ్యం, కందిపప్పు రైతు 8 బజార్లతో పాటు 70 షాపుల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కూరగాయలు టమాటో, బంగాళదుంప, ఉల్లిపాయలు అవసరం మేరకు కొనుగోలు చేసి రైతు బజార్లు ద్వారా ఇప్పటికే వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. వరదలు తరువాత కూరగాయలు కొరత అనేది రాకుండా అధికారులు ముందుగానే అవసరం మేరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మొబైల్ కంటైనర్ల ద్వారా వినియోగదారులకు కూరగాయలు విక్రయించే విధంగా చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో సేంద్రియ వ్యవసాయ సాగు ఉత్పత్తులను వినియోగదారులకు అందించేందుకు జిల్లా వ్యవసాయ అధికారి ధ్రువీకరణ చేయాలని సూచించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం తేజ్ భరత్, డి ఎస్ వో కే. విజయ భాస్కర్, మత్స్య శాఖ అధికారి కృష్ణారావు,వ్యవసాయ మార్కెటింగ్ అధికారి ఎమ్. సునీల్ వినయ్, లీగల్ మెట్రాలజీ, ఫోర్ సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి రాధిక, పౌర సరఫరాల అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ శ్రీనివాసరావు, వినియోగదారుల ఫోరం సంఘ సభ్యులు గొట్టుముక్కల అనంతరావు వాణిజ్య జిల్లా హోల్ సేల్ డీలర్లు, అసోసియేషన్, డీలర్స్, రైసు మిల్లర్లు అసోసి యెషన్, చౌక ధరల దుకాణ అసోసియేషన్ ప్రసిడెంటు, సెక్రటరీ లు తదితరులు పాల్గొన్నారు.

## అల్పాదాయ వర్గాలకు, స్వయం సహాయక సంఘాలకు,కౌలు రైతులకు రుణాలు మంజూరులో జాప్యం వద్దు

**– బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి**





**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** అల్పాదాయ వర్గాలకు, స్వయం సహాయక సంఘాలకు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడం లో బ్యాంకర్లు ఉదారతతో వ్యహారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలియ చేసారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంకర్స్‌తో జిల్లాస్థాయి సమీక్షా కమిటీ , జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశానికి కలెక్టర్ ప్రశాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గత సమావేశంలో జరిగిన అజెండా అంశాలను ముందుగా చర్చించి అనంతరం 2023–24 ఆర్థిక సంవత్సరాలనికి సంబం ధించిన 3వ 4వ త్రైమాసికాల వార్షిక ప్రణాళిక అమలు పురోగతి, ప్రాధాన్యత అంశాలు, అల్పాదాయ వర్గాల ఆర్థిక చేకూర్పు, వ్యవసాయ అనుబంధ రంగాల రుణ ప్రణాళిక ప్రగతి, ఎస్ హెచ్ జి బ్యాంక్ లింకేజీ, వికసిత భారత్, విశ్వ కర్మ యోజన, కేంద్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకు రుణాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరాలనికి సంబంధించి 4వ త్రైమాసికాల ఖరీఫ్ మరియు రబి సీజన్లకు గాను రైతులకు రుణ ప్రణాళిక లో భాగంగా స్వల్ప కాలిక రుణాలకు గాను 6465 కు గానూ 6599 (102.07 శాతం) , టర్మ్ రుణాల కోసం 2828 కు గానూ 3454 మందికి (122.13 శాతం) రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో కౌలు రైతులకు సంబంధించి 98429 సిసి ఆర్సి కార్డులు జారీ చేసిన కౌలు రైతులోని , 67876 మందికి రూ.659.26 కోట్ల మేర ఋణా లు అందచేశారన్నారు. రుణ ప్రణాళిక మేరకు లక్ష్యాలను సాధించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో 18,530 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.711.16 కోట్లు లక్ష్యానికి గాను 18996 గ్రూపులకు రూ.1794.72 కోట్లు (252.37 శాతం) అందించడం జరిగిందని తెలిపారు.

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమాలను బ్యాంకుల ద్వారా నిర్వహించాలని, అంగన్వాడి, శిశు సంరక్షణ వంటి సామాజిక కార్యక్రమాల్లో బ్యాంకర్లు తమ వంతు పాత్ర నిర్వహించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంలో మిశ్రమ పంటలు, అంతర పంటలను సాగు చేసే విధంగా రైతులకు ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. 2024–25 జిల్లాలోని బ్యాంక్ ల వారీగా లక్ష్యాలు ఉద్దేశించిన లక్ష్యాలకు సంబంధించి వార్షిక క్రెడిట్ ప్లాన్ కలెక్టర్ పి ప్రశాంతి విడుదల చేశారు. అనంతరం ప్రధానమంత్రి స్వనిధి పథకం అమలులో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలపడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ధ్రువీకరించిన ధ్రువపత్రాన్ని కలెక్టర్ ఎల్‌డిఎంకు అందజేశారు.ఆర్‌బిఐ ఎల్‌డిఓ.. నాగ ప్రవీణ్, ఎల్‌డిఎం డివి ప్రసాద్,నాబార్డ్ ఏజీఎం స్వామి నాయుడు, లైన్ డిపార్ట్‌మెంట్లు అధికారులు మరియు బ్యాంకు కన్వీనర్లు పాల్గొన్నారు.

## వరదల సమయంలో అవసరమైతే అదనంగా 108 అంబులెన్స్ వాహనాలు

**– ఏ.ఎస్.ఆర్ జిల్లా ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ డా.డేవిడ్**



**కూనవరం, మేజర్ న్యూస్ :** ఎన్టిఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈవో ఆదేశాల మేరకు చింతూరు డివిజనల్ లో గోదావరి వరదలు ఉన్న దృష్ట్యా అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అవసరమైన రోగులను రిఫరల్ ఆసుపత్రులకు తరలించేందుకు 108 అంబులెన్స్ లను సిద్దంగా ఉంచామని అల్లూరి సీతారామరాజు జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డా. డేవిడ్ తెలిపారు. మంగళవారం నాడు ఆయన కూనవరం ,చింతూరు మండలాలలో ఉన్న 108 వాహనాలను వాటి కండీషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరద ఉన్న ప్రాంతాలలో అత్యవసర రోగులకు మెరుగైన వైద్య సేవలు అవసరమైతే ఎలాంటి సమయాలలోనైనా వారిని ఇతర ఆసుపత్రులకు తరలించేందుకు 108 అంబులెన్సులను సిబ్బందిని సిద్దంగా ఉంచినట్లు తెలిపారు. భద్రాచలం , చింతూరు రూట్లలో వరద నీరు చేరడంతో 108 వాహనాలు వెళ్ళలేని పరిస్థితి ఉన్నా అడవి మార్గం ఉన్న ప్రాంతాల నుండి రోగులను తీసుకువెళ్ళేందుకు ప్రయివేటు వాహనాలు కూడా ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వరదలు ఉన్న సమయంలో 108 అంబులెన్సులు సిగ్నల్ ఉన్న ప్రదేశాల వద్ద ఉంచాలన్నారు. గోదావరి వరదల కారణంగా ముందస్తుగా చింతూరు ఏరియా ఆసుపత్రి కి, కూనవరం ఆసుపత్రి కి తరలించిన గర్భిణీలకు ఆరోగ్యశ్రీ సేవలు అందించే విధంగా చూడాలని చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎంవీ కోటిరెడ్డి కూనవరం సూపరింటెండెంట్ డా. కె. మహేష్ బాబులకు సూచించారు.

## ముప్పు ప్రాంతాలలో పర్యటించిన పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్





**గొల్లప్రోలు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన గొల్లప్రోలు పట్టణ పరిధిలో పలు లోతట్టు ప్రాంతాలలో మంగళవారంపిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు సమీక్షించారు. ఇటీవల గడిచిన నాలుగురోజుల నుండి అకాల వర్షాలకు ఎగువ ప్రాంతం నుండి వరద నీరు లోతట్టు ప్రాంతమైన గొల్లప్రోలు లో కాలువల్లో నీటిమట్టం పెరగడంతో పట్టణ శివారు జగనన్న కాలనీ, ఈ బీసీ కాలనీ, రైల్వే ట్రాక్ అవతల సూరంపేట వరద గుప్పెట్లో చిక్కుకోవడంతో అప్రమత్తమైన పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ మరి రెడ్డి శ్రీనివాసు సీనియర్ జనసేన పార్టీ నాయకుడు పిల్లా శివకుమార్ వరద నీటిలోంచి ట్రాక్టర్ పై సూరంపేట చేరుకుని సూరంపేట ప్రజల సమస్యలను మర్రెడ్డి అడిగి తెలుసుకున్నారు. పేదల సమస్యలు అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. అలాగే ముప్పు ప్రాంతాల ప్రజలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని, సూరంపేట ప్రజలకు కావలసిన మౌలిక వసతులు అభివృద్ధి, త్రాగునీరు కల్పించే విధంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళతానని పిఠాపురం ఇంచార్జి మర్రెడ్డి శ్రీనివాస్ సూరంపేట ప్రజలకు భరోసా కల్పించారు.

## కౌలు రైతుల సిసిఆర్‌సి కార్డులు నమోదు ప్రక్రియ వారంలోగా పూర్తి చెయ్యాలి

**– జేసీ తేజ్ భరత్**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లాలో కౌలు రైతులకు పంట సాగుదారుల హక్కుల కార్డులు నమోదు ప్రక్రియ వారం రోజుల్లోగా పూర్తి చెయ్యాలని జాయింట్ కలెక్టరు ఎన్. తేజ్ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరం నుంచి వీసీ ద్వారా మండల తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులతో కౌలు రైతులకు పంట సాగుదారుల హక్కుల కార్డులు నమోదు పై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజభరత్ సమీక్షిస్తూ జిల్లాలో 271 రెవిన్యూ గ్రామాల్లోని 1,09,450 మంది కౌలు రైతులకు సీసీ ఆర్ సి కార్డ్స్ పంపిణీ లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 52,391 మంది సీసీఆర్సి కార్డ్స్ నమోదు (48 శాతం) మాత్రమే చేయడం జరిగిందని, మిగిలిన 57,059 మంది కౌలు రైతులకు సంబందించి వారం రోజుల్లో నూరు శాతం పూర్తి చెయ్యాలని మండల తహసీల్దార్లును, వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 8 మండలాలు భారీ వర్షాలు, వరద ప్రభావంతో పంట పొలాలు నీటమునిగి నష్టపోయే అవకాశం ఉన్నందున సిసిఆర్ సి కార్డుల ప్రక్రియను పూర్తి చెయ్యాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, డి ఎం సివిల్ సప్లై టి. రాధికతదితరులు పాల్గొన్నారు.